క్లుప్తంగా...

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి మల్లారెడ్డి



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి

పోచారం: యమ్నంపేట్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం నిర్వహించిన స్వామి వారి కల్యాణ మహోత్సవంలో కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలోని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదన్నారు. ఇందులో భాగంగా ఆలయ అభివృద్ధికి రూ. 50 లక్షలు మంజూరు చేసిందన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ సరేష్, ఆలయ చైర్మన్ పోలగోని రాజేష్, ఈఓ భాగ్యలక్ష్మి, మంత్రి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



దమ్మాయిగూడలో కంటివెలుగు కార్యక్రమం

దమ్మాయిగూడ: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం ప్రజలు చేసుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణితాగౌడ్ అన్నారు. బుధవారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలోని 18 వ వార్డులో బస్తీ దవాఖాన వద్ద ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా 170 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 21 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ స్వామి, కౌన్సిలర్ శ్రీహరిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తడి-పొడి చెత్తను వేరు చేయాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ తదితరులు

కీసర: గ్రామాల్లో ప్రతిరోజు ఇళ్లనుండి తడి-పొడి చెత్తను వేరుగా సేకరించాలని కీసర ఎంపీడీఓ లక్ష్మీవత్సలదేవి అన్నారు. బుధవారం రాంపల్లిదాయర గ్రామంలో సర్పంచ్ గరుగుల అండాలు ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో తడి-పొడి చెత్త వేరుచేసి సేకరించడం పై గ్రామస్తులు, పంచాయతీ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పంచాయతీ పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఈ మేరకు ప్రజలకు అవగాహనకల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి ఉషా, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు అక్రమాలను బహిర్గతం చేయాలి



ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మేడ్చల్‌రూరల్: దళితబంధు పథకంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అవినీతిని నిరసిస్తూ మేడ్చల్‌లో జాతీయ రహదారిపై ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ కళామండలి అధ్యక్షులు ఎన్వై అశోక్, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పరుశురాం మాట్లాడుతూ దళిత బంధు పథకంలో అక్రమాలకు పాలకపడిన ఎమ్మెల్యేల పేర్లను ముఖ్యమంత్రి బహిర్గతం చేయాలని, అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దళితబంధులో అవినీతి జరిగిందని ముఖ్యమంత్రే స్వయంగా ప్రకటించినందున హైకోర్టు సుమోటోగా కేసును స్వీకరించాలని కోరారు. లబ్ధిదారుల నుంచి తీసుకున్న డబ్బులను వెంటనే వారికి తిరిగి ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుండ భానుచందర్,బక్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీలో గరం...గరం

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై మంత్రి, కాంగ్రెస్, బీజేపీ సభ్యుల మధ్య వాగ్వాదం

- మంత్రికి మద్దతుగా నిలిచిన చైర్మన్, టీఆర్ఎస్ సభ్యులు
- జేపీఎస్ సమ్మె, అక్రమ కట్టడాలు, వైద్య సేవలు, విద్య తదితర శాఖలపై చర్చ
- ప్రజా ఫిర్యాదులపై స్పందన లేదని ఆవేదన

సాక్షి, మేడ్చల్ జిల్లా: జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. ప్రజా సమస్యలపై అధికార ,ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. ప్రజా సమస్యలే ఎజెండాగా జరగాల్సిన సభ పరస్పర ఆరోపణలు, వాగ్వాదాలతో రసభసాగా మారింది. బుధవారం చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అధ్యక్షతన మేడ్చల్-మల్కాజిగిరి జెడ్పీ సమావేశం మధ్యాహ్నం వరకు వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, లోపాలపై చర్చ జరిగింది. మధ్యాహ్నం సభకు మంత్రి మల్లారెడ్డి రావడంతో కాస్త వేడెక్కి సభ వాగ్వాదాలు, బైఠాయింపు, నినాదాలతో స్వల్ప వ్యవధిలోనే వాయిదా పడింది.



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్మన్, జిల్లా కలెక్టర్ తదితరులు

డబుల్ బెడ్‌రూం ఇళ్లపై లొల్లి

- గ్రేటర్ పరిధిలోని పేదల కోసం జీహెచ్ఎంసీ యంత్రాంగం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో 40 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించిందని, ఇందులో 10 శాతం ఇళ్లను స్థానిక పేదలకు కేటాయించనున్నట్లు మంత్రి మల్లారెడ్డి సభలో ప్రకటించారు. మిగతా ఇళ్లను దశల వారీగా కేటాయించటతోపాటు 120 గజాల లోపు స్థలంలో ఇళ్లు నిర్మించుకునే పేదలకు గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలు అందజేస్తామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3 వేల మందికి గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేస్తామమని, 58,59 జీవో కింద అర్హులైన వారందరి ఇళ్ల క్రమబద్ధీకరిస్తామన్నారు.
- దీనిపై కాంగ్రెస్ సభ్యుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానిక పేదలకు 50 శాతం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేయగా, బీజేపీ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి వంద శాతం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని పట్టు పట్టారు. దీంతో మంత్రి మల్లారెడ్డి, కాంగ్రెస్, బీజేపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మంత్రికి మద్దతుగా చైర్మన్ శరత్ చంద్రారెడ్డితోసహా టీఆర్ఎస్ సభ్యులు వాగ్వాదాలకు దిగగా, నిరసనగా కాంగ్రెస్ , బీజేపీ సభ్యులు హరివర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి మంత్రి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జెడ్పీ హాలులో బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు విపక్ష సభ్యులను హాల్ నుంచి బయటికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేశారు. బీజేపీ సభ్యుడు సుదర్శన్‌రెడ్డిని బలవంతంగా పోలీసులు కొత్త దూరం లాక్కెళ్లగా, పెనుగులాట చోటు చేసుకుంది. దీంతో జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

అక్రమ కట్టడాలపై చర్చ

- పంచాయతీల్లో అక్రమ లేఅవుట్లు ,కట్టడాలు జోరుగా సాగుతున్నా డీపీఓ పట్టించుకోవటం లేదని బీజేపీ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. చౌదరిగూడ, ఏదులాబాద్‌తోసహా ఘట్కేసర్ మండలంలోని పలు గ్రామాల్లోని అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వీటిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. కాంగ్రెస్ సభ్యుడు హరివర్ధన్‌రెడ్డి కూడా దీనిని ప్రస్తావిస్తూ పంచాయతీ శాఖలో కోట్లాది రూపాయల అవినీతి ,అక్రమాలు జరిగాయని, అనధికార లేఅవుట్లతో వ్యవసాయ భూములను గుంటల్లో రిజిస్ట్రేషన్‌లు చేసి, అమ్ముకునే వ్యాపారులకు డీపీఓ కొమ్ము కాస్తున్నారన్నారని ఆరోపించారు. కక్ష పూరితంగా గౌడవెల్లి సర్పంచ్‌కు నోటీసులు పంపిస్తున్నారన్నారు. డీపీఓ అవినీతిపై విచారణ చేపట్టకపోతే సీబీఐ విచారణకు కోర్టుకు వెళతానని కాంగ్రెస్ సభ్యుడు హరివర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ అమయ్‌కుమార్ మాట్లాడుతూ కొన్నింటిపై విచారణ చేపట్టామని, త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ శాఖతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి

- పంచాయతీ శాఖలో పనిచేస్తున్న జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు పర్మినెంట్ చేయాలని ఆరు రోజులుగా సమ్మె చేస్తున్నారని, వీరిని క్రమబద్ధీకరించాలని జెడ్పీలో తీర్మానం చేయాలని కాంగ్రెస్,బీజేపీ సభ్యులు పట్టుపట్టగా, ప్రభుత్వ పరిధిలో ఉందని, తీర్మానం చేయలేమని చైర్మన్ శరత్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. వీరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగలమని హామీ ఇచ్చారు.

వైద్య, విద్య ,విద్యుత్తు పై చర్చ

- వేసవిలో డిమాండ్‌కు తగ్గట్లుగా కరంట్ సరఫరా కావటం లేదని, గ్రామాలలో అదనపు ట్రాన్స్‌పార్మర్లను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సభ్యుడు కోరగా, ప్రభుత్వ పాఠశాల్లో వసతులు కల్పించాలని బీజేపీ సభ్యుడు సూచించారు. ఏదులాబాద్ పాఠశాలను మనబడి-మన ఊరులో భాగంగా మొదటి దశలో చేర్చి ,అన్ని వసతులు కల్పించాలని సభ్యుడు సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు కల్పించటంతోపాటు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజా ఫిర్యాదులపై స్పందించాలి

- ప్రజావాణితోసహా ప్రజలు అందించే ఫిర్యాదులపై జిల్లా అధికారులు స్పందించాలని కాంగ్రెస్ సభ్యుడు హరివర్ధన్‌రెడ్డి, బీజేపీ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి కోరారు. ప్రజా ప్రతినిధుల వినతులకు ప్రాధాన్యత ఇవ్వటంతో పాటు కలిసేందుకు వస్తే సమయం కేటాయించాలని సూచించారు.



జెడ్పీలో హాల్‌లో బైటాయించిన కాంగ్రెస్,బీజేపీ సభ్యులు హరివర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి



సుదర్శన్‌రెడ్డిని లాక్కెళుతున్న పోలీసులు



సభలో అధికార ,ప్రతి పక్ష సభ్యుల వాగ్వాదం

ఘనంగా శ్రీ సాయినాథ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: కొర్రెముల్‌లో డీసీపీ జగన్ ఏసీపీ లక్ష్మీ దంపతులు, మాజీ సర్పంచ్ నాగరాజు నీరజ దంపతులు తమ సొంత నిధులతో నిర్మించిన ఆలయంలో శ్రీసాయినాథ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పంచామృత అభిషేకం, సింధూర అలంకారం, మూలమంత్ర విధానేన హోమంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మయ్య, వాసుశర్మ, విశ్వనాథం, సత్యనారాయణ, రవి, ఆనంద్, ముఖేశ్‌కుమార్, వార్డు సభ్యులు దుర్గరాజ్, భాస్కర్, బాబు, స్వామి, నేతలు రమేశ్, మహేంద్రచారి, సుదర్శన్, యాదగిరి, నాగేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేణుగోపాల్ తదితరులు

ఘట్‌కేసర్: వెంకటాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను బుధవారం ఆలయ చైర్మన్ వేణుగోపాల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ నెల 4-8 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. 5న శ్రీ అలివేలుమంగ సహిత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌ముదిరాజ్, లింగంముదిరాజ్, అశోక్ ముదిరాజ్, హరీశ్‌ముదిరాజ్, వెంకటేశ్‌గౌడ్, శివరాజ్‌ముదిరాజ్, సుధాకర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం పేదలకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి నిరంతర కృషి చేస్తుందని జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్‌లో జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గృహలక్ష్మి, జీవో 58,59 పేదలకు ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మేడ్చల్ జిల్లా అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పని చేస్తున్నారన్నారు.



కలెక్టర్‌ను సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్, సభ్యులు తదితరులు

పంచాయతీ శాఖ ,వైద్యంపై ప్రత్యేక సమావేశం: కలెక్టర్

- జిల్లా పరిషత్ సభ్యులు అభీష్టం, చైర్మన్ సూచనల మేరకు జిల్లా పంచాయతీ , వైద్యారోగ్యశాఖలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. జెడ్పీ సభలో పలువురు సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పిన ఆయన పలు శాఖల అధికారులకు సత్వర సమాచారం కోసం ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించటంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాముఖ్యత ఇస్తున్నామన్నారు. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు జిల్లా అధికారులందరూ అందుబాటులో ఉంటారన్నారు. జిల్లా అధికారులు ,ప్రజాప్రతినిధులు సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరముందన్నారు.

కలెక్టర్‌కు ఘన సత్కారం

- జెడ్పీ సమావేశానికి తొలి సారిగా హాజరైన జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, మూడుచింతపల్లి జెడ్పీటీసీ సభ్యులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ,ఎంపీపీలు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఎల్లుబాయి తదితరులు పుష్పగుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికారు. సమావేశంలో ఓడీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి,కో-ఆప్షన్ సభ్యులు, జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, సీఈవో దేవసహాయం , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మేడ్చల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



మేడ్చల్ 18వ వార్డులో మహిళతో మాట్లాడుతున్న హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: రాబోయే ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని పీసీసీ అధికార ప్రతినిధి మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో నిర్వహించిన హత్ సే హత్ జోడో యాత్రలో ఆయన పాల్గొన్నారు.ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ లో మంత్రి మల్లారెడ్డి ని ఇంటికి పంపాలన్నారు. కాంగ్రెస్ బలం పుంజుకుందని, ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. హత్ సే హత్ జోడో యాత్రలో ప్రతి గడపకు వెళ్లి ప్రజల ఇబ్బందులను తెలుసుకుంటూ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్నామన్నారు. మంత్రి మల్లారెడ్డి తన పదవీ కాలంలో తన వ్యాపారాలు అభివృద్ధి చేసుకున్నారే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భవానీ రాఘవేందర్‌గౌడ్ పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకార్మిక సహకార సంఘం అధ్యక్షుడిగా వేణుగోపాల్

ఘట్‌కేసర్: కొర్రెముల్ మత్స్యకార్మిక పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా తెనుగుగూడెంకు చెందిన వేణుగోపాల్ ముదిరాజ్ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. కొర్రెముల్ గ్రామంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సంఘం ఎన్నికలు నిర్వహించారు. సంఘం ఉపాధ్యక్షుడిగా రాజుముదిరాజ్, కార్యదర్శిగా సత్యనారాయణ ముదిరాజ్, కార్యవర్గ సభ్యులుగా వెంకటేశ్‌ముదిరాజ్, బాల్‌రాజ్‌ముదిరాజ్, రాములు ముదిరాజ్, నర్సింహ్మ ముదిరాజ్, వేణుగోపాల్‌ముదిరాజ్‌లను ఎన్నుకున్నారు. సందర్భంగా నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.



తండ్రి మృతిని తట్టుకోలేక..

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

జవహర్‌నగర్: తండ్రి మృతిని తట్టుకోలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేద్కర్‌నగర్ సత్యనారాయణ కాలనీలో సదల బాలకృష్ణ కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ఏప్రిల్ 12న బాలకృష్ణ తండ్రి లింగయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటినుంచి మనస్థాపానికి గురైన బాలకృష్ణ నెల 2న తనకు బతకడం ఇష్టం లేదని భార్య, కుమారుడికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ఆందోళనకు గురైన వారు పక్కింటి వారికి సమాచారం అందించారు. వారు వారు వచ్చి చూసేసరికి తలుపులు మూసి ఉన్నాయి తలుపులు పగులగొట్టి చూడగా బాలకృష్ణ ఉరి వేసుకుని కనిపించాడు. అతడిని కిందకు దింపి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అదృశ్యం

రేఖ (ఫైల్)

జవహర్‌నగర్: వేర్వేరు ఘటనలో ముగ్గురు అదృశ్యమైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. హాకీంపేటకు చెందిన తొగర రేఖ (40) ఇళ్లల్లో పనిచేస్తూ జీవనం సాగించేది. ఏప్రిల్ 30న పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. ఆమె కోసం గాలించి కుటుంబ సభ్యులు ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.


కుటుంబ కలహాలతో వృద్ధురాలు



విజయలక్ష్మీ (ఫైల్)

కౌకూర్ గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో విజయలక్ష్మీ (65) కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తుంది. డబ్బుల విషయంలో ఇంట్లో గొడవలు జరుగుతుండేవి. ఈ నెల 3న గుడికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థిని అదృశ్యం...



శ్రావణి (ఫైల్)

బాలాజీనగర్ మోహన్‌రావు కాలనీలో దేవారాయ కుమార్ కుమార్తె దుర్గాలక్ష్మీ అలియాస్ శ్రావణి (22) ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంబీఏ చదువుతుంది. ఈ నెల 3న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కలెక్టరేట్ ఎదుట టీడబ్ల్యూజేఎఫ్ ధర్నా



సాక్షి,మేడ్చల్ జిల్లా: జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలను ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్కే సలీమా డిమాండ్ చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ రిలే నిరాహార దీక్షలో భాగంగా బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ఆందోళనలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం టిడబ్ల్యూజేఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందన్నారు. మీడియాపై రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందన్నారు. జర్నలిస్టులపై వివక్ష చూపుతున్నారని టీడబ్ల్యూజే రాష్ట్ర సహాయ కార్యదర్శి గుమ్మడి ప్రసాద్ అన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల డిమాండ్లను నెరవేర్చాలని నేషనల్ కౌన్సిల్ నెంబర్ ఎంపల్లి పద్మా రెడ్డి కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ, శాసనసభ్యులకు వినతి పత్రాలు, జిల్లా కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర కౌన్సిలింగ్ సభ్యులు యావపురం రవి,పటేల్ నరసింహ యాదవ్ , మండపాక కళ్యాణ చక్రవర్తి తెలిపారు.అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు బెలిదే అశోక్, శివకుమార్, దేవేందర్, విష్ణు మోహన్, ఎన్.శివకుమార్, డేవిడ్ రాజ్, యాట రాజు, వినోద్, సాయిరాజ్, వెంకట్, శ్రీనివాసరావు, నరేష్, రాము, పరుశురాం, నిరంత్, ఉపేందర్, శ్రీను, వినోద్ కుమార్, ముఖేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఘట్‌కేసర్: ప్రతాపసింగారం ముత్వెల్లిగూడలో దాతలు కొంతం సత్తిరెడ్డి, మోహన్‌రెడ్డి, సర్పంచ్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి స్వామివారిని దర్శించుకుపి పూజలు నిర్వహించారు. అనంతరం భద్రారెడ్డి ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రైతు బంధు మండల కోఆర్డినేటర్ అంజిరెడ్డి, ఉప సర్పంచ్ గీత, వార్డు సభ్యులు సుదర్శన్, విష్ణుగౌడ్, శ్యామ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, స్థానిక భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి, దాతలు సత్తిరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి

ముదిరాజ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సురేందర్

మేడ్చల్: మండల పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో గ్రామ ముదిరాజ్ భవన నిర్మాణానికి సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో మొదటి అంతస్తు భవనం ఉండగా అది సరిపోవడం లేదని ముదిరాజ్ సంఘం విజ్ఞప్తి మేరకు రెండంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ ముదిరాజ్‌ల ఆత్మగౌరవ ప్రతీకగా ఈ భవనాన్ని ఈశ్వర చంద్ర ఫౌండేషన్ ద్వారా నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఘట్‌కేసర్: గీత కార్మికులకు రూ. 5 లక్షల బీమా ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేసేత్తు అవుషాపూర్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్ర పటానికి రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యుడు భిక్షపతిగౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేశ్, వార్డు సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, వీరేశం, స్థానిక గీత కార్మిక సంఘం అధ్యక్షుడు రంగులు, కుమార్‌గౌడ్, పెంటేశ్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మయ్య, శంకరయ్య, ఆంజనేయులు, రవీందర్, ప్రభాకర్‌గౌడ్, భూపాల్, మధు, నర్సింహ, చెన్నమల్లు పాల్గొన్నారు.

